# మనోడు

రివాల్వింగ్ చెయిర్‌లో వెనక్కివాలి కళ్ళు మూసుకున్నాడు మధుసూదనరావు. కాసేపు అలా వుండి, కళ్ళు తెరిచి టైమ్ చూశాడు. అయిదున్నర.

పి.ఎ.తో ఇంటర్‌కమ్‌లో ఏవో ఆఫీసు విషయాలు మాట్లాడాడు. తర్వాత కాలింగ్‌బెల్ నొక్కాడు. 'సార్' అంటూ ఆఫీస్ బోయ్ వచ్చాడు.

"ఈ ఫైల్ ఇచ్చేసి రా" అని, ఎటాచ్డ్ టాయ్‌లెట్ రూమ్‌లోకెళ్ళాడు మధుసూదనరావు.

సబ్బుతో ముఖం కడుక్కున్నాడు. టర్కీ టవల్‌తో ముఖం తుడుచుకుని, పౌడరు రాసుకుని, తల దువ్వుకుని ఆఫీసు రూమ్‌లోకొచ్చాడు.

అప్పటికే బోయ్ బ్రీఫ్‌కేసు పట్టుకుని వున్నాడు.

మధుసూదనరావు బయటికొచ్చాడు. బోయ్ రూమ్‌కు తాళం వేసి అతని వెనకాలే నడిచాడు.

బ్రీఫ్‌కేసు మారుతీ కారులో పెట్టి ఆఫీసు తాళాలిచ్చి, నిల్చున్నాడు బోయ్. మధుసూదనరావు కారు స్టార్ట్‌చేసి, బోయ్ నమస్కారం అందుకుని ముందుకు పోనిచ్చాడు.

హైదరాబాద్ నగరం అప్పుడే విద్యుద్దీపాల వింత సింగారంతో మెరిసిపోతోంది. మధుసూదనరావు కారు నడుపుతూ ఆలోచిస్తున్నాడు. అతనికి కొంచెం చిరాగ్గా వుంది.

ఆ రోజు పొద్దుటే అతని ఊరునుంచి అతని బంధువు కొడుకు భాస్కర్ ఇంటికి వచ్చాడు. ఆ ఉద్యోగం తనకొచ్చేలా చూడమని అడగడానికొచ్చాడు. వాళ్ళ నాన్న రాసిన ఉత్తరం కూడా పట్టుకొచ్చాడు.

అతను తెచ్చిన ఉత్తరంలో తనపై ఒకటే పొగడ్తలు... మధుసూదన్, నువ్వింత వాడివయినందుకు మేమెప్పుడూ గర్విస్తుంటాం. ఆ మధ్య మన వెంకట్రావు కొడుక్కి ఉద్యోగం వేయించినందుకు, వాళ్ళే కాదు, మన ఊరు వూరంతా నిన్ను ఎంత మెచ్చుకుందో మాటల్లో చెప్పలేను. పెద్ద పొజిషన్లో మనోడున్నాడు. మన పిల్లలకింక ఫర్వాలేదనుకున్నాం. మన భాస్కర్‌కు కూడా ఉద్యోగం వేయించగలవు. నీ మేలు మరిచిపోం- అంటూ తన బంధువు చాలా రాశాడు. అది చదివినప్పుడు తనకెంతో హాయిగా, సుఖంగా అనిపించింది.

అంతలో, నిన్న క్లబ్బులో, విశ్వనాథచౌదరి రిక్వెస్టు గుర్తుకొచ్చింది. అంతవరకూ పొందిన సంతోషం ఎగిరిపోయింది.

ఉత్తరం చేత్తో పట్టుకుని ఓ రెండు నిమిషాలు ఆలోచిస్తూ ఉండిపోయాడు తను. "చూద్దాం. చాలా కాంపిటేషన్ వుంది. ఉన్నది ఒకటే పోస్టు. నువ్వేమో అత్తెసరు మార్కులతో పాసయ్యావు.

సాయంత్రం అయిదున్నరకు ఓసారి క్లబ్బుకి రా" అని తను భాస్కర్‌కు క్లబ్బు అడ్రసు చెప్పాడు.

"అలాగే సార్" అంటూ అతను వెళ్ళిపోయాడు.

రెడ్ సిగ్నల్ చూసి కారు ఆపాడు మధుసూదనరావు.

భాస్కర్ గురించి ఆలోచిస్తుంటే తన ఊరు, తన బాల్యం గుర్తుకొచ్చాయి.

-చుట్టూ పచ్చని పొలాలు. ఆ పొలం గట్టమీద తాటి చెట్టు. ఆ పక్కనే చెరువు. చుట్టూ కొబ్బరి చెట్లు, మధ్య మధ్య మామిడి చెట్లు. స్కూలు విడిచిపెట్టగానే ఇంటికొచ్చి, అన్నం తిని చెరువు దగ్గరకు పరుగో పరుగు. చెరువులో స్నానాలు. ఈత పందాలు.

పొలం పనులున్నప్పుడు తండ్రివెంట చేలోకి. నాన్న ఎంత కష్టపడేవాడు! కూలీలతో పాటు నాన్నా పనిచేసేవాడు. అరకపట్టేవాడు. ఊడ్పుల్లో ఆకుమడి నుంచి ఆకు కట్టలు మోసేవాడు. కుప్ప నూర్పుల్లో ధాన్యం ఎగరబోసేవాడు. తను కూడా స్కూలు లేనప్పుడు నాన్నతోపాటు పనిచేసేవాడు.

ఆ నాలుగెకరాల పొలంమీద వచ్చే దాంతోనే నాన్న ఎలాగో కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. ఎకరం పొలం కట్నం ఇచ్చి అక్క పెళ్ళి చేశాడు. తను చదివినంతా చదివించాడు. తను పట్నంలో మకాంపెట్టి, డిగ్రీ చదివినప్పుడు ఎకరం పొలం అమ్మేశాడు. పోస్టుగ్రాడ్యుయేషన్ అయ్యాక, తను గ్రూప్ వన్ పరీక్షలు రాశాడు. మంచి మార్కులొచ్చాయి. వెంటనే పెద్ద ఉద్యోగమే వచ్చింది. దాంతో చాలా మంచి సంబంధం వచ్చింది. మావగారు రిటైర్డు కలెక్టర్. వాళ్ళకు వాళ్ళు తనను వెదుక్కుంటూ వచ్చారు.

గ్రీన్ సిగ్నల్ చూసి మధుసూదనరావు గేర్ మార్చి కారును ముందుకు పోనిచ్చాడు.

-నాన్నపోయాక, అమ్మను ఇక్కడకు తీసుకువద్దామనుకున్నాడు. అయితే, అప్పటికే తన వూర్లో ఏడెకరాల పొలం తను కొనివున్నాడు. అప్పట్లో నాన్న తమ స్థాయికి తగ్గ చిన్న సంబంధమే తేగలిగాడు అక్కకు. వాళ్ళు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని అక్క కుటుంబాన్ని తన వూరికి తీసుకొచ్చేశాడు. తన పొలం బావే చూస్తున్నాడు. ఇచ్చినప్పుడు ఎంతోకొంత ఇస్తాడు. పంటలు బాగోపోతే ఇవ్వడు. తన దగ్గరే కూతురు వుండడం అమ్మకూ బావుంది. అక్కడ తమకున్నది చిన్న పెంకుటిల్లు. అదికూడా బాగా పాతబడిపోయింది. మూడు నాలుగు లక్షలతో ఓ డాబా కట్టిద్దామనుకున్నాడు తన వూర్లో. అయితే, అక్కడ ఎంత డబ్బుపోసి కట్టినా, తర్వాత దాన్ని అమ్ముదామంటే కొనే నాథుడుండడని ఆ ఆలోచన విరమించుకున్నాడు. పొలంకొన్నా దానిమీద వచ్చేదేమీ వుండడం లేదు. ఎంతోకొంత తనవాళ్ళే తింటున్నారనే తృప్తి వుంది.

సుజాతకు తమ వూర్లో పొలం కొనడం అసలు ఇష్టం లేదు. అయితే తను ఒప్పించాడు. ఉన్నదంతా పట్నంలోనే పెట్టేబదులు మారుమూల పల్లెటూర్లో కూడా కొంత సమకూర్చుకోవడం మంచిదని తనంటే, ఆమె అప్పటికి ఊరుకుంది. తర్వాత, ఆదాయం పెద్దగా రావడంలేదని, అత్తా ఆడపడుచూ మింగేస్తున్నారని సణగడం మొదలెట్టింది. "అక్కడ మనకు ఆస్తివుంది. దానిని జాగ్రత్తగా చూసే



మనవాళ్ళున్నారు. ప్రస్తుతం మనకు కావలసింది అదే. ఆదాయం గురించి దిగులెందుకు?" అని తను సుజాతకు ఇప్పటికీ చెబుతూనే వున్నాడు.

-మధుసూదనరావు కారును క్లబ్ ఆవరణలోకి పోనిచ్చాడు. అతను కారు దిగేటప్పటికి క్లబ్ బోయ్ గబ గబా పరుగెత్తికొచ్చి, బ్రీఫ్ కేసు పట్టుకున్నాడు. మధుసూదనరావు బ్యాక్ పాకెట్ నుంచి దువ్వెన తీసుకుని, తలదువ్వుకుని, క్లబ్‌లోని ఎ.సి.రూమ్‌లోకి అడుగు పెట్టాడు.

"గుడ్ ఈవినింగ్" అన్నారు అక్కడున్న వాళ్లంతా.

"గుడ్ ఈవినంగ్ ఫ్రెండ్స్" అని మధుసూదనరావు కుర్చీలో కూర్చున్నాడు.

"మీక్కూడా వేస్తున్నా" అన్నాడు విశ్వనాథ చౌదరి పేక ముక్కలు కలుపుతూ.

"వెయ్యండి మిత్రమా" అన్నాడు మధుసూదనరావు చిన్నగా నవ్వుతూ.

రెండు నిమిషాలకు భాస్కర్ బితుకు బితుకుమంటూ వచ్చి, విష్ చేశాడు. మధుసూదనరావు తలపంకించి, "ఇలారా" అన్నట్టు కళ్ళతో సైగచేశాడు.

భాస్కర్ అతని పక్కకు వెళ్ళాడు.

"రేపు ఇంటర్వ్యూ వుంది కదా సార్. గుర్తు చేద్దామని .. " అంటూ నసిగాడు భాస్కర్.

"చూద్దాం. రేపు పదిన్నరకి ఆఫీసుకు రా" అన్నాడు మధుసూదనరావు మామూలుగా కంటే కాస్త గొంతు పెంచి.

విశ్వనాథ చౌదరి భాస్కర్‌నీ, మధుసూదనరావునూ ఓ సారి చూసి, మళ్ళీ పేకలో తల దూర్చాడు.

భాస్కర్ వెళ్ళేక, "రేపటి ఇంటర్వ్యూ కోసమేనా అతనొస్తే" అన్నాడు విశ్వనాథ చౌదరి.

"ఆ, మా బంధువులబ్బాయి"

"మరి , మా విజయ ప్రసాద్ .." అంటూ ఆగిపోయాడు విశ్వనాథ చౌదరి.

"మిత్రమా, మీకంటే నాకు కావలసిన వాళ్ళెవరు చెప్పండి." అన్నాడు మధుసూదనరావు నవ్వుతూ.

"థ్యాంక్యూ మధూజీ" అన్నాడు చౌదరి నవ్వుతూ.

విశ్వనాథ చౌదరి పేకాడుతున్నాడే గానీ, మనసు పీకుతోంది.

'బంధువులబ్బాయికి మానేసి, తను చెప్పిన వాడికిస్తాడా' అని మనసులో అనుకున్నాడు.

"చూద్దాం. రేపు తేలిపోతుంది కదా" అనుకున్నాడు మళ్ళీ.

భాస్కర్ బితుకుబితుకుమంటూ వచ్చి వెళ్ళడం మధుసూదనరావుకి పదే పదే గుర్తుకొస్తోంది.

తను ఉద్యోగంలో చేరేదాకా భాస్కర్‌లాగే వుండేవాడు. నలుగురిలో తిరగడానికి చొరవ చూపలేకపోయే వాడు. తను పెరిగిన పల్లెటూరు వాతావరణం అందుకు కొంత కారణం కావచ్చు. అంతకంటే ముఖ్యకారణం ఆర్థిక పరిస్థితులు. తమది దిగువ మధ్యతరగతి కుటుంబమయినా పేదరికంలోనే గడిపాడు. అయితే, తన తెలివితేటలు మంచి ఉద్యోగాన్నిచ్చాయి. ఆ తర్వాత, పెద్ద పెద్ద వాళ్లంతా

తామే చొరవ తీసుకుని తనను తమలో కలుపుకున్నారు. తన బిడియమూ పోయింది. పై స్థాయి వాళ్ళందరితో తనూ కలిసి మెలిసి తిరిగాడు. తనూ ఆ స్థాయికి చేరుకున్నాడు. ఆ కారణంగానే ఈక్లబ్‌లో మెంబరయ్యాడు.

మధుసూదనరావు ఆలోచిస్తూ, పేక మిడిల్ డ్రాప్ చేశాడు.

అంతలో కంట్రాక్టర్ జగపతిరాజు వచ్చాడు. మధుసూదనరావును విష్ చేశాడు. అక్కడికి కాస్త దూరంలోవున్న టేబుల్ ముందు కూర్చున్నాడు. మధుసూదనరావు అక్కడికివెళ్ళి అతనికెదురుగా కూర్చున్నాడు.

"ఏమిటి విశేషాలు"

"మీకు తెలీని సంగతులేముంటాయి చెప్పండి మా దగ్గర"

"ఆ టెండర్ గురించేనా?"

"అవును సార్. మొన్ననే మీకంతా చెప్పేను కదా. ఎలాగయినా అది నా కొచ్చేలా చూడాలి మీరు"

"చూద్దాం"

"చూద్దాం అంటే కాదు సార్. కిందటి సారి కాంట్రాక్టులో నేను ఎంత నష్టపోయానో మీకు తెలియంది కాదు. ఈ సారయినా.."

"వర్రీ కాకండి. మీకే వస్తుంది"

"థాంక్యూ. మీరా భరాసో ఇస్తే నేనింక నిశ్చింతగా వుండొచ్చు".

"అన్నట్టు మీ అబ్బాయి ఇంజనీరింగ్‌లో చేరేడా?"

"మొన్ననే కర్నాటకలో చేర్పించాను" అన్నాడు జగపతిరాజు.

"మధూ. మీ కార్డులు తీసుకుంటారా" అని చిన్నగా కేకేశాడు విశ్వనాథ చౌదరి.

మధుసూదనరావు కుర్చీలోంచి లేస్తూ

"మరి మీరు కార్డ్సు ఆడరా?" అన్నాడు.

"ఇవేళ నాకు వేరేపనుంది, రేపొస్తాను" అని జగపతిరాజు వెళ్ళిపోయాడు.

మధుసూదనరావు పేక ముక్కలు పట్టుకున్నాడు.

బోయ్‌ను పిలిచి, ఆ క్లబ్‌లోనే వున్న బార్ నుంచి తమకు కావలసిన డ్రింక్సు తెప్పించుకున్నారంతా. డ్రింక్ చేస్తూ పేకాడుతూ మధ్య మధ్య కబుర్లు నంజుకుంటున్నారు.

"మధూ , మీ బిల్డింగ్ కనస్ట్రక్షన్ ఎందాకా వచ్చింది."

"ఫినిషింగ్ స్టేజ్‌లో వుంది. ఈ నెలాఖరకు పూర్తవుతుంది."

"మీ బిల్డింగ్‌తో మీ కాలనీకే కళ వస్తుంది" అన్నాడు కృష్ణారెడ్డి.

ఆ మాటకు ఆనందించి, "మీది మాత్రం చిన్న బిల్డింగా? రాజమహల్లా వుంటుంది" అన్నాడు

మధుసూదనరావు.

"నేను కట్టేటప్పటికి ఆ మాట నిజమే. ఇప్పుడు కొత్త కొత్త డిజైన్లతో చాలా బిల్డింగులొచ్చాయి" అన్నాడు కృష్ణారెడ్డి.

"ఇప్పుడు పాత డిజైన్లే ఫ్యాషన్ కదా" అన్నాడు విశ్వనాథ చౌదరి మూడో పెగ్గులో కొస్తూ.

మధుసూదనరావు గ్లాసు కూడా ఖాళీ అయ్యింది.

"షో' అంటూ పేక చూపించాడు చౌదరి.

వాళ్ళిచ్చిన చిప్స్ తీసుకుని, గ్లాసందుకుని సిప్ చేస్తూ, "మధూ, మా ప్రసాద్ గురించి మరిచిపోరుకదూ" అన్నాడు చౌదరి.

"మీరు మళ్ళీ మళ్ళీ చెప్పాలా చౌదరి సాబ్" అన్నాడు మధు.

తాము తీసుకున్న షేర్ల ధరలు ఏయే కంపెనీల్లో ఎలా పెరిగాయో, వేటిని అమ్ముకుంటే ఎంత లాభమో - గురించి మాట్లాడుకున్నారు.

రెండో పెగ్ పూర్తిచేసి, "ఫ్రెండ్స్, నా కోటా అయిపోయింది. గుడ్‌నైట్" అని మధుసూదనరావు క్లబ్ నుంచి బయటపడ్డాడు.

"భాస్కర్‌ని క్లబ్‌కు పిలిచి మంచిపనే చేశాను. చౌదరి కళ్ళారా చూశాడు. అతనికప్పుడే అనుమానం వచ్చింది" అనుకుంటూ చిన్నగా నవ్వుకున్నాడు దార్లో, నెమ్మదిగా కారు పోనిస్తూ,

ఇంటికెళ్ళి, స్నానం చేసి, సుష్టుగా భోంచేసి హాయిగా నిద్రపోయాడు.

* * * * *

మధుసూదనరావు ఆఫీసుకెళ్ళేటప్పటికి ఇంటర్‌వ్యూ కోసం చాలామంది వచ్చివున్నారు. మరో ఇద్దరు ఆఫీసర్లను తీసుకుని తన రూమ్‌లోకి వెళ్ళాడు. ఒక్కొక్కర్నీ ఇంటర్‌వ్యూ చెయ్యడం మొదలెట్టారు.

భాస్కర్ వచ్చాడు. మధుసూదనరావు ముందే చెప్పివుండడంతో అతని పక్కన కూర్చున్న ఆఫీసర్లు భాస్కర్‌ను కష్టమైన ప్రశ్నలడిగారు. భాస్కర్ బెంబేలుపడిపోయాడు. దిగులుగా రూమ్‌నుంచి బయటికెళ్ళాడు. తర్వాత మరో ఇద్దర్ని గబగబా ఇంటర్వ్యూ చేశాడు.

విజయప్రసాద్ వచ్చాడు. అతన్ని చూస్తూ, "మంచి మార్కులొచ్చాయి. ఇంకా చదవలేకపోయావా?" అన్నాడు మధుసూదనరావు.

"ఇంటిదగ్గర పరిస్థితులవల్ల సాధ్యపడలేదు సార్. ఈ ఉద్యోగం వస్తే ప్రైవేటుగా చదువుతాను సార్" అన్నాడు ప్రసాద్.

మధుసూదనరావు మెచ్చుకోలుగా చూశాడు.

"ఒ.కె. ప్రసాద్. యు ఆర్ సెలక్టెడ్" అన్నాడు మధుసూదనరావు.

"థాంక్యూ సార్" అని హుషారుగా వెళ్ళిపోయాడు ప్రసాద్.

"తన లావాదేవీలన్నీ ఈ పోస్టులో వుండే వాడివల్లే జరుగుతాయి. ప్రసాద్‌లాంటి తెలివిగలవాడే బాగా డీల్ చెయ్యగలడు" అనుకున్నాడు మధుసూదనరావు.

మర్నాడు భాస్కర్ వూరిలో, అతని బంధువులు, "మనోడు, భాస్కర్‌కి ఉద్యోగం వేయించలేకపోయాడంటే అది పూర్తిగా అతని చేతిలో వుండి వుండదు. మరోటి చూస్తాడులే" అనుకున్నారు.

ఆ మర్నాడు విజయప్రసాద్ వూరిలో అతని బంధువులు "మొత్తంమీద మన చౌదరి ప్రసాద్‌కి ఉద్యోగం వేయించాడు. మనోడికి చాలా ప్రెస్టేజీ వుంది" అనుకున్నారు.

ఆ రాత్రి క్లబ్‌లో విశ్వనాథ చౌదరి జగపతిరాజు, కృష్ణారెడ్డి ప్రభృతులు "మధు మనోడే" అనుకున్నారు ఆనందంగా.

*(రచన మాసపత్రిక, ఆగస్టు 1995)*